సాక్షి జనగామ

సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



టీఆర్‌ల జారీలో..

సీసీఐ పత్తి కొనుగోలు చేసేందుకు టీఆర్(టెంపరరీ రిజిస్ట్రేషన్)ల జారీలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. - 8లో▸



జాప్యమెందుకు?

తెలుగు విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా నియమించడానికి సీనియార్టీ తేల్చడంలో జాప్యం జరుగుతోంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32⁰ /18⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త చలి తీవ్రత ఉంటుంది.





జంపన్నవాగు వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు



సారలమ్మ గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



కోళ్లతో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



శివసత్తుల పూనకాలు

జాతర ముగిసినా.. తగ్గని భక్తుల జోరు

మేడారం మినీ జాతర శనివారంతో ముగిసినా.. భక్తుల రద్దీ కొనసాగుతోంది. సమ్మక్క–సారలమ్మల దర్శనం కోసం ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అమ్మవార్ల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. ఈనెల 19న(బుధవారం) తిరుగువారం పండుగ నిర్వహించనున్నారు.

- ఎస్ఎస్ తాడ్వాయి

- వివరాలు 8లో▸

న్యూస్‌రీల్

ప్రాక్టికల్ పరీక్షలకు 17 మంది గైర్హాజరు

జనగామ రూరల్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 17 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ జితేందర్ రెడ్డి తెలిపారు. మొదటి సెషన్‌లో జనరల్ 161 విద్యార్థులకు 153 మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో జనరల్, ఒకేషనల్ 195 విద్యార్థులకు 186 విద్యార్థులు హాజరు కాగా 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను సందర్శించినట్లు జితేందర్ రెడ్డి తెలిపారు. జిల్లా పరీక్ష నియంత్రణ అధికారులు శ్రీనివాస్ వి.శేఖర్ జఫర్‌గఢ్ జనగామ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు



నర్మెట: మండలకేంద్రంలోని కాకతీయుల కాలం నాటి అతి పురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకోగా గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలోని ఆలయ కమిటీ భక్తుల సహకారంతో నూతన ఆలయ నిర్మాణం చేపట్టింది. ఇటీవల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను మూడు రోజులు ఘనంగా నిర్వహించారు. కాగా రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాతూరి మల్లారెడ్డి– మాధవి దంపతులు రూ.2,01,116, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి దేవులపల్లి ప్రభాకర్ –ప్రఫుల్ల రూ.51,116, సర్వేయర్ జంగిటి మహేందర్– నిరోషారాణి రూ.25,116, ప్రభుత్వ ఉపాధ్యాయుడు అనందాస్ రాధాకృష్ణ –రమాదేవి రూ.21,116, ఆకుల రాంచందర్– అంజలి రూ.11,116, పాతూరి పద్మారెడ్డి– స్వాతి రూ.10,016 ఆదివారం కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో జంగిటి అంజయ్య, దేవులపల్లి భాగ్యలక్ష్మి ప్రతాప్‌రెడ్డి, నిమ్మ హనుమారెడ్డి, రాజబోయిన లక్ష్మీనారాయణ, వంగ భూపాల్ రెడ్డి, కల్లూరి రాజు, కొండ బాలయ్య మేకల పెద్దాపురం, వేముల రాంచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి



జనగామ రూరల్ : వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎన్‌పీడీసీఎల్ జనగామ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సెక్షన్–1 విభాగం ఏరియాలో వేసవి ముందస్తు కార్యాచరణలో భాగంగా 63,100,163 కేవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లలో లోపాలు లేకుండా చార్జీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిగితా సీజన్‌ల కంటే వేసవిలో విద్యుత్ డిమాండ్ మేరకు తగు సామర్థ్యం కలిగి ఉండేలా ట్రాన్స్‌ఫార్మర్లను అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. వినియోగదారులు సైతం విద్యుత్ వినియోగంలో పొదుపు పాటిస్తూ ఎన్‌పీడీసీఎల్ యంత్రాంగం తోడ్పాటుకు పాటుపడాలన్నారు. ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ వేణుగోపాల్, ఏఈ సౌమ్య, సబ్ ఇంజనీర్ మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య తెలంగాణ కోసం పోరాటం



జనగామ రూరల్: రాష్ట్రం మారిన పీడిత ప్రజలకు న్యాయం జరగడం లేదని, ప్రజాస్వామ్య తెలంగాణ కోసం పోరాటం చేయాల్సి అవసరం ఉందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని విజయ గార్డెన్‌లో జిల్లా అధ్యక్షుడు పాకాల వెంకన్న ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా ద్వితీయ మహాసభల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గడ్డం లక్ష్మణ్, భారత్ బచావో నాయకుడు గాదె ఇన్నయ్య పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా.. పేదల బతులకు మారలేదని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఎలాంటి న్యాయం జరగలేదని గద్దర్ తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రజాఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి కడకంచ సంపత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలకు వేళాయె..

మహిళా సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎలక్షన్లు

- ఏప్రిల్ వరకు ప్రక్రియ పూర్తి
- మార్చి వరకు పని చేయనున్న ప్రస్తుత కమిటీలు
- జిల్లాలో 1.28 లక్షల మంది సభ్యులు



జనగామ: మహిళా సంఘాల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుత సంఘాల పదవీ కాలం మార్చితో ముగియనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సంఘాలపై ప్రత్యేక దృష్టి సారించింది. మహిళా శక్తి ప్రోగ్రామం ద్వారా ఆర్థిక బలోపేతం సాధించే విధంగా సంఘాలకు పెద్ద పీట వేస్తోంది. ఇందులో భాగంగా మండల, గ్రామ, జిల్లా స్థాయిలో సంఘాలకు కొత్త సారథులను ఎన్నుకునేందుకు ఎన్నికల కసరత్తు మొదలుపెట్టింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పర్యవేక్షణలో సెర్ప్ ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

శిక్షణ..

జిల్లాలో 466 వీఓ, 11,240 సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు ఉండగా.. 1,28,115 మంది మహిళా సభ్యులు ఉన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'మహిళా శక్తి మెంబర్ మొబిలైజేషన్' కార్యక్రమంలో 1,716 సంఘ సభ్యులను చేర్చుకోవాలనే లక్ష్యం మేరకు 355 వీఓల పరిధిలో 2,013 మందికి సభ్యత్వం ఇచ్చి 117.31 శాతం అదనంగా అచీవ్‌మెంట్ సాధించారు. కొత్త సంఘాల ఏర్పాటుకు హైదరాబాద్‌లో డీపీఎం, ఏపీఎం స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వగా, జిల్లా, గ్రామ, మండల లెవల్‌లో వీఓ, వీఓఏ, సెర్ప్ సిబ్బంది, మండల, గ్రామ సమాఖ్యలకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుత కమిటీల పదవీ కాలం మార్చిలో ముగియనుండగా.. కొత్త సారథులు ఏప్రిల్ చివరి వారంలో బాధ్యతలను తీసుకోనున్నారు.

కసరత్తు షురూ..

పాత, కొత్త సంఘాలను కలుపుకుని కొత్త సారథుల ఎన్నికలో భాగంగా ఈ నెల చివరి వారం నుంచి ఎలక్షన్ ప్రక్రియను మొదలు పెట్టనున్నారు. నూతన సంఘాల పదవీ కాలం ఏడాది నుంచి మూడు సంవత్సరాలపాటు ఉంటుంది. అధ్యక్ష, ఉపాధ్యక్ష, పాలకవర్గ సభ్యులను చేతులెత్తే పద్ధతిలో ఎన్నుకోనున్నారు. స్వయం సహాయ సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం స్త్రీ నిధి ద్వారా పెద్ద ఎత్తున రుణాలను మంజూరు చేస్తోంది. జిల్లాలో 2024–25 వార్షిక సంవత్సరంలో 4,644 ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.431 కోట్ల రుణాలు ఇవ్వగా.. 90.48 శాతం మేర లక్ష్యాన్ని చేరుకున్నారు. మహిళా క్యాంటీన్లు, చిరు వ్యాపారాల్లో సంఘాలు రాణిస్తూ.. ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నాయి. సంఘాల బలోపేతం, లావాదేవీల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షుల పాత్ర కీలకమని చెప్పుకోవచ్చు. మహిళా సంఘాలకు కొత్త సారథులను ఎన్నుకునేందుకు ఏకగ్రీవం లేదా చేతులెత్తే పద్ధతి, చీటీల ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు చర్యలు చేపడతారు. మొదట గ్రామ సంఘ అధ్యక్షురాలు.. అక్కడ నుంచి మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నుకోబడుతారు. మండల అధ్యక్షులు కలిసి జిల్లా సమాఖ్య అధ్యక్షులను ఎన్నుకుంటారు. మండల సమాఖ్య ఎలక్షన్లను ఈ నెల చివరి వరకు పూర్తి చేసి, మార్చి నాలుగవ వారంలో జిల్లా సమాఖ్య అధ్యక్ష, ఉపాధ్యక్ష, పాలక మండలి సభ్యులను ఎన్నుకుని, ఏప్రిల్‌లో నూతన కమిటీలచే ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

జిల్లాలో మహిళా సంఘాల వివరాలు	
మండలాలు	12
పంచాయతీలు	280
రుణాల టార్గెట్	రూ.476.47 కోట్లు
రుణాల మంజూరు	రూ.431 కోట్లు
వీఓలు	466
ఎస్‌హెచ్‌జీ	11,240
మొత్తం సభ్యులు	1,28,115

తెలంగాణలో శాసన మండలి నిర్వీర్యం



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- జనగామలో ఎమ్మెల్సీ ఓటర్ల సమ్మేళనం

జనగామ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో శాసనమండలిని నిర్వీర్యం చేశారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అధ్యక్షతన జరిగిన ఓటర్ల సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డితో కలిసి కిషన్‌రెడ్డి మాట్లాడారు. సరోత్తంరెడ్డి ఉత్తముడని కొనియాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సరోత్తంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వచ్చే శివరాత్రి పర్వదినం రోజున ఒక్కపొద్దు ఉండి, ఆదేరోజు ఓటు వేసి ఉపవాస దీక్ష వీడాలని పిలుపునిచ్చారు. గతంలో ప్రభుత్వం అంటే ఉపాధ్యాయులు అనే ఉద్దేశంతోనే శాసనసభతోపాటు శాసనమండలిలో ఎమ్మెల్సీ ఎన్నుకునే ప్రక్రియను తీసుకొచ్చారన్నారు. తన గురువు రామారావుకు ఎన్నికల సమయంలో అనేక మంది చందాలు పోగు చేసి అండగా నిలిచారన్నారు. గతంలో మంత్రులు శాసనమండలికి రావాలంటే వణికిపోయేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. బీజేపీ మాత్రం ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసే భాగంలో వారి వెంటే ఉంటుందన్నారు. కేంద్రం డీఏ, వేతనాలు సకాలంలో చెల్లిస్తుంటే, రాష్ట్రంలో దారుణంగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత, అప్పుల కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిన రికార్డును సొంతం చేసుకున్నాడని ఎద్దేవా చేశారు. అధికారంలోకి రాగానే ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి, ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ కృషితో హైదరాబాద్‌కు కంపెనీలు వస్తున్నాయని, ప్రధాని దెబ్బకు పాకిస్తాన్ అడుక్కునే పరిస్థితికి చేరుకుందన్నారు. గ్రామ పంచాయతీలకు గత ప్రభుత్వం 10ఏళ్ల పాటు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వచ్చే విధంగా చూడాలని కోరుతూ దేవాదుల లిఫ్టు ఇరిగేషన్ కాంట్రాక్టు వర్కర్లు పి.సాయిలు ఆధ్వర్యంలో కేంద్ర మంత్రికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, మాజీ మంత్రి గుండె విజయరామారావు, ఎమ్మెల్సీ, జిల్లా ఇన్‌చార్జ్ రాజమౌళిగౌడ్, నాయకులు బొజ్జపల్లి సుభాష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శివరాజ్‌యాదవ్, దుబ్బా రాజశేఖర్‌గౌడ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త, అనిల్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పట్టణంలో కారు బీభత్సం



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్పన



యువకుడికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

- బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూంలోకి దూసుకు వచ్చిన వాహనం
- ఒకరి పరిస్థితి విషమం.. ఐదుగురికి గాయాలు
- తొమ్మిది వాహనాలు ధ్వంసం
- పోలీసుల అదుపులో యువకులు



ప్రమాదానికి కారణమైన కారు

జనగామ: జిల్లా కేంద్రంలో ఆదివారం ఓ కారు బీభత్సం సృష్టించిన ఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా మారగా.. ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. జనగామ చౌరస్తా నుంచి ఏపీ 36 ఏటీ 1179 నంబరు గల కారు సూర్యాపేట రోడ్డువైపు అతివేగంగా వస్తోంది. అందులో నలుగురు యువకులు ఉన్నారు. సడెన్‌గా హ్యాండ్ బ్రేక్ వేయడంతో కారు పక్కనే ఉన్న బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూం వైపు దూసుకు వచ్చింది. అదే సమయంలో రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామానికి చెందిన కొయ్యడ రాకేష్, కొయ్యడ శ్రావన్, సింగిరెడ్డి సంతోష్‌కుమార్ స్నేహితుడి వివాహ వేడుకలకు గిఫ్ట్ కొనుగోలు చేసేందుకు షోరూం వద్దకు వచ్చారు. షోరూంలో పనిచేసే లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన మహిళా ఉద్యోగిని కల్పన అదే సమయంలో బయటకు వస్తున్నారు. సెకండ్ల వ్యవధిలో వంద కిలోమీటర్ల వేగంతో వచ్చిన కారు షోరూం ముందు పార్క్ చేసిన తొమ్మిది బైక్‌లను ఢీ కొడుతూ కల్పనను లాక్కుపోయింది. ఈ ఘటనలో ఆమె రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరు చెందిన మరో మహిళ పేరువుల మేరితో పాటు ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించి.. కారు ప్రమాదానికి కారకులైన నలుగురు యువకులను పోలీసులకు అప్పగించారు. కారు ఎన్పీడీసీఎల్ ఉద్యోగికి చెందినదిగా భావిస్తుండగా.. అందులో ఉన్న కొంతమంది మద్యం సేవించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కల్పనతో పాటు నలుగురికి జిల్లా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి వరంగల్‌కు పంపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో దీపక్‌కు చోటు



అవార్డు అందుకుంటున్న దీపక్



ఉమ్లింగ్ లా పాస్ వద్ద జాతీయ జెండాతో దీపక్

జనగామ రూరల్: ఇటీవల నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్వకేషన్ రికార్డ్ హోల్డర్స్‌లో జనగామ పట్టణానికి చెందిన మోర్తాల దీపక్‌కు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ప్రపంచంలో అత్యంత ఎత్తైన వాహన రహదారి(ఉమ్లింగ్ లా పాస్ – 19,024 అడుగుల ఎత్తు)ని 2021 నవంబర్ 16న, లడక్‌లోని కార్థుంగ్ లా పాస్‌ని(17,982 అడుగులు ఎత్తు) 2023 అక్టోబర్ 17న ద్విచక్ర వాహనంతో దీపక్ అధిరోహించి చరిత్ర సృష్టించాడు. ఈ మేరకు శనివారం ఢిల్లీలో ఇంటర్ నేషనల్ కాన్వకేషన్ సందర్భంగా వియాత్నం దేశానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ చూ బయో క్యూ చేతుల మీదుగా దీపక్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు అందుకున్నాడు. కాగా ప్రస్తుతం దీపక్ జనగామ ప్రభుత్వ ఆస్పత్రిలో రేడియో గ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. దేశంలో బెస్ట్ మోటార్ సైకిల్ సాహస యాత్రికుడిగా పేరు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్న దీపక్‌ను పలువురు అభినందించారు.

20 ఫీట్లతో ఇబ్బందులే..

- నిడిగొండ వైపు 20, ఫతేషాపూర్ వైపు 32 ఫీట్లు
- ఒక్కో వైపు ఒక్కోలా నిడిగొండ ఆర్‌యూబీ నిర్మాణం
- అధికారుల అనాలోచిత నిర్ణయాలు



నిడిగొండ వైపు 20 ఫీట్ల వెడల్పుతో కొనసాగుతున్న పనులు



ఫతేషాపూర్ వైపు 32 ఫీట్ల వెడల్పు

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ రైల్వే ట్రాక్ వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణం పూర్తయినా ప్రయోజనం లేకుండా పోనుందా.? అంటే క్షేత్రస్థాయి పనులు జరుగుతోన్న తీరు చూస్తే ఔనన్నదే సమాధానం.. అధికారుల అనాలోచిత చర్యలు, నిర్ణయాలు, నిర్లక్ష్యంతో ఓ వైపు ఆర్‌యూబీ ఇరుకుగా మారనుంది. ఒక వాహనం వెళ్లాకే మరో వాహనం వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడనుంది. నిడిగొండ నుంచి ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, మాదారం, లక్ష్మీతండా, ఖిలాషాపూర్ గ్రామాలకు వెళ్లే మార్గంలో రైల్వే ట్రాక్ వద్ద రూ.6 కోట్లతో ఆర్‌యూబీ నిర్మిస్తున్నారు. ట్రాక్ ఇరువైపులా 497 ఫీట్ల పొడవుతో నిర్మాణం పనులు చేపట్టారు. అయితే పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారమయ్యేలా పనులు జరగడం లేదు. ఫతేషాపూర్ వైపు అప్రోచ్ రోడ్డు 32 ఫీట్ల వెడల్పుతో నిర్మిస్తుండగా.. నిడిగొండ వైపు మాత్రం 20 ఫీట్లకే పరిమితం చేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగే అవకాశం లేకుండా పోనుంది.

ఎందుకిలా..?

ట్రాక్ వద్ద ఫతేషాపూర్ వైపు 32 ఫీట్లు చూపిన రోడ్డును నిడిగొండ వైపు 20 ఫీట్లుగా రెవెన్యూ అధికారులు చూపినట్టుగా తెలుస్తోంది. నక్ష ప్రకారం మార్కింగ్ చేశామని అధికారులు చెబుతున్నా.. ఓ వైపు 32 ఫీట్లు, మరో వైపు 20 ఫీట్లు ఎలా ఉంటుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రెవెన్యూ అధికారులు నక్ష ప్రకారం ఇచ్చిన వివరాల ఆధారంగా ఆర్‌యూబీ డిజైన్ చేశామని రైల్వే అధికారులు.. ఒప్పందం ప్రకారం పనులు చేస్తున్నానని కాంట్రాక్టర్ చెబుతున్నారు. ట్రాక్ వద్ద నిడిగొండ వైపు ఉన్న ప్రైవేట్ వ్యక్తుల భూమి సేకరించేందుకు పలు గ్రామాల నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రైల్వే డీఆర్ఎం దృష్టికి తీసుకెళ్లగా జిల్లా కలెక్టర్‌ను కలవాలని యోచిస్తున్నారు. ఇటీవల ఆర్‌యూబీ పనులను సందర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. భూమి ఇచ్చేలా యజమానులను ఒప్పించాలని, సేకరణకు తాను కొన్ని డబ్బులు ఇస్తానని చెప్పారు. దీంతో పలుమార్లు భూ యజమాని మడ్లపల్లి రాజు, కొలిపాక రాజ్‌కుమార్‌లతో నాయకులు మాట్లాడారు. ఆర్‌డీఓ వద్దకూ వారిని తీసుకెళ్లి చర్చించారు. నిడిగొండ వైపు భూసేకరణకు స్వచ్ఛందగా తాము కొంత డబ్బులు చెల్లిస్తామని నాయకులు పేర్కొనగా.. బహిరంగ మార్కెట్ ప్రకారం తమకు పరిహారం ఇవ్వాలని భూ యజమానులు పట్టుబడుతున్నట్లు తెలిసింది. దీంతో భూసేకరణ విషయం కొలిక్కి రాలేదు. ఇదిలా ఉంటే అందుబాటులో ఉన్న స్థలంలో 20 ఫీట్ల వెడల్పుతో కాంట్రాక్టర్ పనులు కొనసాగిస్తున్నాడు. మేమేం చేయలేమని రైల్వే అధికారులు చెబుతుండటం గమనార్హం.

చట్టం ప్రకారం..

ప్రజాప్రయోజన ప్రాజెక్టుల కోసం 2013 చట్టం ప్రకారం భూమి సేకరించే అధికారం ప్రభుత్వ విభాగాలకు ఉంది. ఇక్కడ మాత్రం అధికారులు ఆ దిశగా కసరత్తు చేయడం లేదు. చట్టం ప్రకారం సేకరణకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉన్న దృష్ట్యా.. సంప్రదింపుల ద్వారా భూసేకరణ చేయాలనుకుంటున్నాయని ఓ అధికారి తెలిపారు. భూమి సేకరించకుండా నిడిగొండ వైపు కేవలం 20 ఫీట్లతో అండర్‌గ్రౌండ్‌లో రోడ్డు నిర్మిస్తే.. ఇబ్బందులు తప్పవని ప్రజలు పేర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ప్రజలకు ప్రయోజనకరంగా ఉండేలా ఇరువైపులా 32 ఫీట్లతో అండర్‌గ్రౌండ్‌లో రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇరువైపులా 32 ఫీట్లతో నిర్మించాలి



ఇరువైపులా 32 ఫీట్లతో అండర్‌గ్రౌండ్ రోడ్డు నిర్మించాలి. నిడిగొండ వైపు 20 ఫీట్లతో రోడ్డు నిర్మిస్తే ఆర్‌యూబీతో ఎలాంటి ప్రయోజనం ఉండక పోగా నిత్యం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఫతేషాపూర్ వైపు 32 ఫీట్లు ఉంటే.. నిడిగొండ వైపు 20 ఫీట్లు ఎలా ఉంటుంది..? దీనిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలి. కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలి..

- గొట్టం కరుణాకర్‌రెడ్డి, ఫతేషాపూర్

ఇరుకుగా నిర్మిస్తే ఇబ్బందులే..



శాశ్వతంగా ఉండే ఆర్‌యూబీ అండర్ గ్రౌండ్‌లో ఓ వైపు 20 ఫీట్లతో ఇరుకుగా నిర్మిస్తే తీవ్ర ఇబ్బందులే. ఉన్నతాధికారులు స్పందించి భూ యజమానులతో మాట్లాడి ఒప్పించాలి. పలు గ్రామాల నాయకులు కూడా కొంత పరిహారం చెల్లించేందుకు ముందుకొస్తున్నారు. 20 ఫీట్ల అండర్‌గ్రౌండ్ రోడ్డు నిర్మాణానికి ఒప్పుకోబోం.. అలా నిర్మిస్తే ఆందోళనలు చేస్తాం.

- మేడిపల్లి నరేశ్, ఇబ్రహీంపూర్

కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకించాలి

జఫర్‌గఢ్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కార్మిక, ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ సంపన్నులకు అనుకూలంగా ఉందని ఆరోపించారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగడం లేదన్నారు. కార్మికులకు మేలు చేసే 49 కార్మిక చట్టాలను కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. యాజమాన్యాలకు మేలు చేసే విధంగా బీజేపీ వ్యవహరిస్తున్నదన్నారు. ఇందుకోసం కొత్తగా నాలుగు లెబర్ కోడ్‌లను అమలు చేసేందుకు సిద్ధ పడుతున్నట్లు తెలిపారు. మతతత్వ విధానాల ముసుగులో పూర్తిగా కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నారన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు యాతం సమ్మయ్య, నల్లతీగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వంలో సోషల్ మీడియా పాత్ర కీలకం

- 'కాఫీ విత్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో నాయిని



కాఫీతో ఎమ్మెల్యే నాయిని, పీసీసీ సభ్యులు బత్తిని, ఈవీ, పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలు

హన్మకొండ చౌరస్తా: పదేళ్ల ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని అధికారంలో తీసుకురావడానికి సోషల్ మీడియా కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేశారని, ప్రజాప్రభుత్వ ఏర్పాటులో సోషల్ మీడియా పాత్ర కీలకమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ నేహాల్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో 'సోషల్ మీడియా వారియర్స్–కాఫీ విత్ ఎమ్మెల్యే' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సోషల్‌మీడియా విశేష కృషి చేసిందన్నారు. పదేళ్లలో సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసిన కార్యకర్తల పై అప్పటి ప్రభుత్వం కేసులు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. సోషల్‌మీడియా వారియర్స్ శ్రమను గుర్తించి తగిన ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో తొలిసారి 'కాఫీవిత్ ఎమ్మెల్యే కార్యక్రమం' చేపట్టడం అభినందనీయమన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, డాక్టర్ నాయిని గోదావిష్ణువర్ధన్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి రమేశ్, నాయకులు తిరుపతిరెడ్డి, జీవన్‌రెడ్డి, హుస్సేన్, లక్ష్మి, భరత్, చందు, రమేశ్ పాల్గొన్నారు.



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



దుకాణంలో ఆట బొమ్మలు కొనుగోలు చేస్తున్న మహిళలు

జాతర ముగిసినా.. తగ్గని భక్తుల జోరు



గంటకొడుతున్న భక్తులు

- మేడారానికి తరలివచ్చిన వేలాది మంది
- ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్ట చర్యలు
- 19న తిరుగువారం పండుగ

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క, సారలమ్మ మినీజాతర ముగిసినా భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. జంపన్న వాగు స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి పుట్ట వెంట్రుకలు సమర్పించుకున్నారు. అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మేడారం పరిసరాల్లో వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

ముందస్తు అంచనాతో అధికారుల ఏర్పాట్లు..



ముడుపు కడుతున్న మహిళ

మినీ జాతర అనంతరం ఆదివారం కూడా భక్తులు అధిక సంఖ్యలో మేడారానికి వస్తారని ముందస్తు అంచనాతో జిల్లా అధికారులు, పోలీస్ శాఖ తరపున ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ రవీందర్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా భక్తుల ప్రైవేట్ వాహనాలను పార్కింగ్ స్థలాల్లోకి మళ్లించారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి భద్రత కట్టుదిట్టం చేశారు. పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి.. సిబ్బందిని సమన్వయ చేస్తూ బందోబస్తు నిర్వహించారు.

సరైన సమయంలో బస్సులు లేక భక్తుల ఇబ్బందులు

అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆదివారం వేలాదిగా తరలివచ్చిన భక్తులు సరైన సమయంలో ఆర్టీసీ బస్సులు లేక ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్‌లోనే పడిగాపులు కాశారు. తీరా ఒక్క బస్సు రాగానే ఎక్కేందుకు పోటీ పడ్డారు. ఈ సమయంలో మహిళలు, పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

సమన్వయంతో జాతర విజయవంతం

జిల్లా అధికారులు, పోలీస్ శాఖ, పూజారుల సమన్వయంతో మినీ జాతర విజయవంతమైందని మేడారం జాతర కమిటీ చైర్మన్ అరెం లచ్చుపటేల్ అన్నారు. ఈమేరకు ఆదివారం పూజారులతో కలిసి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. గోవిందరాజు, పగిడిద్దరాజులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీజాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంత్రి సీతక్క, జిల్లా ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేసి జాతర విజయవంతానికి కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా జాతర విజయవంతానికి సహకరించిన అధికారులు, సిబ్బంది, పూజారులకు కృతజ్ఞతలు తెలిపారు.

19న తిరుగువారం పూజలు

ఈనెల 19న (బుధవారం) తిరుగువారం పండుగ నిర్వహించనున్నారు. మినీజాతర (మండమెలిగె) పండుగ ముగిసిన అనంతరం మరోసారి అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు తిరుగువారం పండుగ చేయడం ఆనవాయితీ. తిరుగువారం పండుగ రోజున మేడారం, కన్నెపల్లిలో పూజారులు, ఆదివాసీ కుటుంబాలు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ఘనంగా 'స్వయంవర్' దశాబ్ది ఉత్సవాలు



జ్యోతి వెలిగించి ఉత్సవాలు ప్రారంభిస్తున్న నమఃశివాయి, పీఎస్ మూర్తి, తదితరులు

హన్మకొండ : హనుమకొండ నక్కలగుట్టలోని 'ది స్వయంవర్'లో దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ది స్వయంవర్ స్థాపించి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం 11వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ప్రముఖ వస్త్రవ్యాపారి కాసం నమఃశివాయ జ్యోతి వెలిగించి ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ప్రథమంగా ఎత్నిక్‌వేర్ స్టోర్ ది స్వయంవర్‌ను స్థాపించామని చెప్పారు. ఈ స్టోర్ దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు 47 నగరాల్లో 85 బ్రాంచ్‌లుగా విస్తరించినట్లు పేర్కొన్నారు. వివాహాది శుభకార్యాలకు, పిల్లలకు, యువకులకు, పెద్దలకు అందుబాటులో కలెక్షన్స్ ఉన్నాయని తెలిపారు. అందుబాటు ధరల్లో షేర్వాణీ, ఇండో వెస్ట్రన్, జోద్‌పురి బ్లాజర్స్, సెమీ ఇండో వెస్ట్రన్ కుర్తా, పైజామా, మోదీ సెట్, పట్టు పంచె, పగిడి, పెర్‌ఫ్యూమ్స్, దుపట్టా, లెనిన్ కుర్తాలు, షర్ట్‌లు తమ ప్రత్యేకత అని వివరించారు. డైరెక్టర్లు కాసం మల్లి కార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పీఎస్.మూర్తి, పుల్లూరు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్ధశతాబ్దపు అపూర్వ కలయిక..

- 54 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కురవి: ఆ విద్యార్థులు అర్ధ శతాబ్దం తరువాత కలుసుకున్నారు. 54 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ఒకచోట కలిసి ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. అనంతరం జ్ఞాపకాలను నెమరువేసుకుని రోజంతా ఉల్లాసం, ఉత్సాహంగా గడిపారు. ఈ అపురూప ఘట్టానికి మండలంలోని బలపాల జెడ్పీ హైస్కూల్ వేదికైంది. పాఠశాలకు చెందిన 1971–1972 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కలియ తిరిగారు. తరగతి గదులను పరిశీలిస్తూ జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం తమతో చదువుకుని చనిపోయిన స్నేహితులకు శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కిలారి అశోక్‌బాబు, చింతలమోహన్‌రావు, చిక్కా వెంకటేశ్వర్లు, తాటికొండ మల్లారెడ్డి, రావూరి విమల, దార నర్సింహారావు, రావూరి రమేశ్, ఈడిగిరాల ఐలయ్య, బొల్ల వసంత, గరక వెంకటేశ్వర్లు, కె.పద్మ , నామా సైదులు, రావూరి ప్రభాకర్‌రావు, అంబటి వెంకటనారాయణ పాల్గొన్నారు.

చెస్‌తో మేధస్సు పెంపు

- ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



ఆటతీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: చదరంగంతో మేధస్సు పెరుగుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీలను ఆదివారం ఎమ్మెల్యే నాయిని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. మానసికంగా ధైర్యంగా ఉన్నప్పుడే జీవితంలో వచ్చే ఆటుపోట్లను ఎదుర్కొంటామన్నారు. టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 170 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకు నాలుగు రౌండ్లు ముగియగా అందులో అల్లాడి శ్రీవాట్సన్, రజనీకాంత్, కొమురవెల్లి, వివేక్, ఆద్య, రవీంద్రనాథ్ ముందంజలో ఉన్నారని తెలిపారు. టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, ఆర్బిటర్లు పాల్గొన్నారు.

గ్రామీణ కళలను రక్షించుకోవాలి

- పద్మశ్రీ గడ్డం సమ్మయ్య



దేవరుప్పులలో కళాకారుల ప్రదర్శన

దేవరుప్పుల: గ్రామీణ కళలను నేటి కళాకారులు భావితరాలకు అందించాలని పద్మశ్రీ గడ్డం సమ్మయ్య సూచించారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ అయ్యప్ప స్వామి యువ కళాక్షేత్రం అధ్యక్షుడు బోడ కల్యాణ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన 200 మంది కళాకారులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద ప్రదర్శన ఇచ్చారు. పలువురి కళాకారులను సమ్మయ్య, కల్యాణ్ ఘనంగా సన్మానించారు.

జ్వరంతో విద్యార్థి మృతి

- ఆశ్రమ పాఠశాల వార్డెన్, హెచ్ఎం నిర్లక్ష్యమే కారణం: బంధువులు
- హాస్టల్ ఎదుట బంధువుల ఆందోళన



వినీత్ (ఫైల్)

వాజేడు: జ్వరంతో బాధపడుతూ వాజేడు మండల పరిధి పేరూరు బాలుర ఆశ్రమ హాస్టల్ విద్యార్థి సోయం వినీత్ (13) శనివారం రాత్రి మృతి చెందాడు. పేరూరు గ్రామానికి చెందిన వినీత్ ఊళ్లోని ఆశ్రమ హాస్టల్‌లో ఉంటూ అదే పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వినీత్‌కు మూడు రోజులక్రితం జ్వరం వచ్చింది. హాస్టల్లో ఒక మాత్ర ఇవ్వగా జ్వరం తగ్గింది. దీంతో ఇంటికి వచ్చాడు. ఇంటి వద్ద నీరసంగా ఉండడంతో అతడి మేన మామ ధర్మవరంలో ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించాడు. ఆర్ఎంపీ.. బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని.. వెంటనే మెరుగైన వైద్యం కోసం తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో కారులో శుక్రవారం సాయంత్రం వినీత్‌ను ఏటూరు నాగారం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యం చేస్తుండగానే మృతి చెందాడు. మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చిన బంధువులు, కుటుంబ సభ్యులు వినీత్ మృతి చెందడానికి హాస్టల్ వార్డెన్, పాఠశాల హెచ్ఎం నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. జ్వరమొస్తే కుటుంబ సభ్యులకు తెలపకుండా మాత్ర వేసి పంపించడం ఏంటని ప్రశ్నించారు? అనంతరం బంధువులు, ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర నాయకుడు కొర్స నర్సిమూర్తి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకుడు ఉయిక శంకర్‌తో కలిసి ఆశ్రమ పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. విద్యార్థి మృతికి కారణమైన వార్డెన్ శ్రీను, హెచ్ఎం నాగరాజుపై చర్యలు తీసుకోవాలని, వినీత్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ నినదించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన కొనసాగింది. వినీత్ కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు బాలుడి తల్లి శైల కుమారికి ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని వార్డెన్, హెచ్ఎం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

చెరువులో మునిగి మత్స్యకారుడి మృతి

- కొడవటంచలో ఘటన



ఓదెలు (ఫైల్)

రేగొండ: చెరువులో మునిగి ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని కొడవటంచలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన పోలు ఓదెలు (46) చేపలు పట్టడానికి కోనేరు చెరువు వద్దకు వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో వలలో చిక్కుకుని ఊపిరాడక మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు ..



రాజు (ఫైల్)

గణపురం: ట్రాక్టర్ బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గాంధీనగర్ సమీపంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గాంధీనగర్‌కు చెందిన మోటపోతుల రాజు(35) ట్రాక్టర్ నడుపుకుంటూ మైలారం నుంచి స్వగ్రామం వస్తున్నాడు. ఈ క్రమంలో మిషన్ భగీరథ పంపుహౌస్‌కు వెళ్లే మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో రాజుకు తీవ్ర గాయాలుకావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు.

టీఆర్‌ల జారీలో 'విజిలెన్స్' విచారణ!

- ఇప్పటికే ఏడుగురిపై వేటు, త్వరలో మరికొందరిపై..
- వ్యవసాయశాఖ ప్రమేయంపై ఆరా
- ఉమ్మడి జిల్లాలో మరికొందరిపై వేటుకు మల్లగుల్లాలు



వరంగల్: సీసీఐ పత్తి కొనుగోలు చేసేందుకు టీఆర్ (టెంపరరీ రిజిస్ట్రేషన్)ల జారీలో పెద్ద మొత్తంలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించిన మార్కెటింగ్‌శాఖ రాష్ట్రంలోని ఏడుగురు మార్కెట్ కమిటీ కార్యదర్శులను సస్పెండ్ చేసిన విషయం విదితమే. వ్యవసాయ శాఖ అధికారులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలతోనే కార్యదర్శులు టీఆర్‌లు జారీ చేసినట్లు గుర్తించిన మార్కెటింగ్ శాఖ మొత్తం ఈ వ్యవహారంపై నిజానిజాలను నిర్ధారించేందుకు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విచారణలో టీఆర్‌ల జారీలో ప్రమేయం ఉన్న వ్యవసాయ అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లతో పాటు మరికొంత మంది మార్కెట్ కార్యదర్శుల వ్యవహారం బహిర్గతమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఏఈఓల ఇష్టారాజ్యం..

రైతుల నుంచి పత్తిని సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు చేసేందుకు టీఆర్‌ల కోసం ధ్రువీకరణ పత్రాల జారీలో కొంత మంది వ్యవసాయ శాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పత్రాలు క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) మాత్రమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి జారీ చేయాలని వ్యవసాయ శాఖ నుంచి స్పష్టంగా నిబంధన ఉంది. అయినప్పటికీ కొంత మంది ఏఈఓలు అడ్డగోలుగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఓ జిల్లాలో ఏకంగా ధ్రువీకరణ పుస్తకాన్ని ప్రింట్ చేయించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోలు చేసే 80 మార్కెట్ కమిటీల్లో టీఆర్‌ల జారీపై మార్కెటింగ్ శాఖ అధికారులు విచారణ చేపట్టగా నిబంధనల పట్టించుకోకుండా సుమారు 46 వేలకు పైగా టీఆర్‌లు జారీ అయినట్లు అధికారులు గుర్తించారు. 20 మార్కెట్ కమిటీల్లో ఈ వ్యవహారం జరిగినట్లు గుర్తించినప్పటికీ ఫిర్యాదు వచ్చిన మార్కెట్ కమిటీ కార్యదర్శులను మొదటి విడతగా సస్పెండ్ చేశారు. రెండో విడత మరికొంత మందిపై వేటు పడే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విచారణలో వ్యవసాయ అధికారుల ప్రమేయం బహిర్గతమైతే వారిపై చర్యలు తప్పవన్న చర్చ సాగుతోంది.

లారీ బీభత్సం..

- ఆర్టీసీ బస్సుకు ఢీ..
- పది మందికి గాయాలు



పాన్‌షాపులోకి దూసుకెళ్లిన లారీ

పాలకుర్తి టౌన్: జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఆదివారం ఉదయం ఓ లారీ బీభత్సం సృష్టించింది. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగం కారణంగా సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ.. ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈఘటనలో పలువురు గాయాలపాలయ్యారు. నల్లగొండ నుంచి సిమెంట్ లోడుతో హనుమకొండ వైపునకు వెళ్తున్న లారీ, తొర్రూరు నుంచి జగద్గిరిగుట్టకు వెళ్తున్న తొర్రూరు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సును పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఢీకొంది. అనంతరం ఎదురుగా ఉన్న పాన్‌షాపులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న పది మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. అందులో ముగ్గురి తలకు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిలో పాలకుర్తి మండలం వావిలాల గ్రామానికి చెందిన నారబోయిన యాకమ్మ, అనపర్తి చిలకమ్మ, తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన కొత్త పద్మారెడ్డి ఉన్నారు. నారబోయిన కొంరయ్య, అనపర్తి వెంకటయ్య, సోమయ్య, బెజోజు రాజేశం, నాగరాణి, వేల్పుల శ్రీశైలం, ఈరవెన్ను గ్రామానికి చెందిన దుంపల గౌరమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ప్రయాణికులకు పాలకుర్తి ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పది మందిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అంతేకాకుండా ఘటనాస్థలిలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన మూడు మోటార్ సైకిళ్లపై నుంచి లారీ దూసుకెళ్లడంతో ధ్వంసమయ్యాయి. ఘటనా స్థలిని సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, ఎస్సైలు పవన్‌కుమార్, లింగారెడ్డి పరిశీలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై దూలం పవన్‌కుమార్ తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్ సందర్శించారు.

సీనియార్టీ తేల్చడంలో జాప్యమెందుకు?

- కమిటీని నియమించి రెండువారాలు
- ఇంకా సమర్పించని నివేదిక
- తెలుగు అధిపతి, బీఓఎస్ నియామకమెప్పుడు?
- నేడు కమిటీ సమావేశమయ్యే అవకాశం!

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో తెలుగు విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ ఏటూరి జ్యోతి ఈఏడాది జనవరి 9న మృతి చెందిన విషయం విదితమే. అయితే ఆ విభాగంలో రెగ్యులర్ ప్రొఫెసర్లు లేరు. నలుగురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు మామిడి లింగయ్య, మంథిని శంకర్, చిర్రరాజు, కర్రె సదాశివ్ ఉన్నారు. ఆ నలుగురిలో సీనియార్టీ ప్రాతిపదికన ఒకరిని విభాగం అధిపతిగా, మరొకరిని బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా నియమించాల్సి ఉంటుంది. అయితే ఆ నలుగురు కూడా ఆ పదవులు ఆశిస్తున్నారు. ఒకరిపై మరొకరు ఆరోపణలు చేస్తూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వీరిలో ఎవరిని విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా నియమించడానికి సీనియార్టీ తేల్చాలని వీసీ ఓ కమిటీని నియమించాలని నిర్ణయించారు. దీంతో ఈ ఏడాది జనవరి నెలాఖరులో అప్పటి రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి ఈ కమిటీని నియమిస్తూ వారం రోజుల్లో రిపోర్టు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కమిటీని నియమించి రెండు వారాలు గడిచినా ఇప్పటివరకూ రిపోర్టు ఇవ్వలేదు. దీంతో ఈ కమిటీని నియమించింది కాలయాపనకేనా? ఇంకెప్పుడు సీనియార్టీని తేలుస్తారని ఆ నలుగురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రశ్నిస్తున్నారు. జాప్యం చేయడంలో ఆంతర్యమేమిటీని యూనివర్సిటీలో చర్చ సాగుతోంది. అయితే కమిటీ మాత్రం ఆరోపణలు పట్టించుకోదని, తాము ఆ నలుగురిలో సీనియార్టీని మాత్రమే పరిశీలించి త్వరలోనే రిపోర్టు అందజేస్తామని కమిటీలో ఉన్న ఓ ప్రొఫెసర్ పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈనెల 17న కమిటీ సమావేశమై సీనియార్టీని తేల్చి రిపోర్టు ఇవ్వాలని నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాగా, ఆ నలుగురిలో ఎవరు విభాగం అధిపతి, బీఓఎస్‌గా నియామకం అవుతారనే అంశం యూనివర్సిటీలో ఆసక్తికరంగా మారింది.

మానవాళిపై ఏసుక్రీస్తు అనుగ్రహం

- వరంగల్ క్యాథలిక్ పీఠాధిపతి బిషప్ డాక్టర్ ఉడుముల బాల



ఏసుప్రభు జయంతి వేడుకల చిహ్నాన్ని ఆవిష్కరిస్తున్న బిషప్ ఉడుముల బాల

మహబూబాబాద్ రూరల్ : సమస్త మానవాళిపై ప్రభువైన ఏసుక్రీస్తు అనుగ్రహం ఉంటుంది.. విశ్వాసంతో ఆరాధిస్తే అనుగ్రహిస్తారని వరంగల్ క్యాథలిక్ పీఠాధిపతి బిషప్ డాక్టర్ ఉడుముల బాల అన్నారు. వరంగల్ క్యాథలిక్ పీఠం ఆధ్వర్యాన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఫాతిమామాత దేవాలయం ఆవరణలో క్రీస్తు 2025వ జయంతి ఉత్సవ(జూబ్లీ వేడుకల) చిహ్నాన్ని ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమానికి అమెరికాలోని జాక్సన్ డయాసిస్ బిషప్ మోస్ట్ రెవరెండ్ జోసెఫ్ కోపాజ్, జాక్సన్ డయాసిస్ ఎం.ఎస్.జీ.ఆర్.ఎల్విన్ సండ్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫాతిమామాత దేవాలయం నుంచి శనిగపురం శివారులో ఉన్న కరుణామయి మరియమాత పుణ్యక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేదుకల్లో బిషప్ ఉడుముల బాల మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యతోపాటు మంచి బుద్ధులు నేర్పి భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో స్థిరపడేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫాతిమా మాత దేవాలయ విచారణ గురువు ఫాదర్ సైమన్, ఏసుగుట్ట చర్చి ఫాదర్ గునీలియన్, ఫాదర్లు జోసెఫ్, పీటర్, వివిధ గ్రామాలు, మండలాల ఫాదర్లు, క్రీస్తు ఆరాధకులు పాల్గొన్నారు.